

'సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం'
జీవితంలో సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్తేనే విజయం దరి చేరుతుందని ప్రముఖ ఇంగ్లిష్ ట్రైనర్, కౌన్సెలర్, కోచ్ రాఘవేంద్ర అన్నారు. బాసర ట్రిపుల్ఐటీలో కెరీర్, ఇంటర్వ్యూ అనే అంశాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. 8లో▸



భూదాతలు..అభివృద్ధి ప్రదాతలు
సమాజంలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా తమ గ్రామాలకు సేవ చేస్తుంటారు. కొందరు మాత్రమే సొంత ఊరి రుణం తీర్చుకోవాలనే తపనతో అభివృద్ధికి పాటుపడుతుంటారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.1 / 19.6
వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ తగ్గుతుది.

ప్రజలకు ప్రాణసంకటం!



ఆదివారం కుక్కల దాడిలో గాయపడిన మహిళ



గత నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనం

- జిల్లాలో పిక్కలు పీకుతున్న కుక్కలు!
- 36 గంటల్లో 48 మందిపై దాడి
- అయినా చలించని బల్దియా
- హడలిపోతున్న జిల్లా వాసులు
- రెండేళ్లలో ప్రభుత్వాస్పత్రుల్లో 2,333 మందికి కుక్కకాటు చికిత్స

నిర్మల్‌చైన్‌గేట్: ''కుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించండి. బ్యానర్లు, హోర్డింగ్లు ఏర్పాటు చేయండి. కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలి. వేసవి తీవ్రత ఈసారి ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున.. కుక్కలు దాహంతో దాడులు చేసే ప్రమాదం ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి'' హైదరాబాద్‌లో కుక్కల దాడిలో ఒక బాలుడు మృతి చెందిన నేపథ్యంలో బల్దియా అధికారులకు ఇటీవల సీడీఎంఏ సత్యనారాయణ చేసిన ఆదేశాలివీ. నిర్మల్ మున్సిపాలిటీలో సీడీఎంఏ ఆదేశాల్లో ఒక్కటి కూడా అమలు కావడం లేదు. మరోవైపు జిల్లాలో కుక్కలు పిక్కలు తీస్తున్నాయి. ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సామూహికంగా వీధుల్లో తిరుగుతూ మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడిచేస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట.. ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతున్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల బెడద నివారణలో బల్దియా నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది.

36 గంటల్లో 48 మందిపై దాడి...

గడిచిన 36 గంటల్లో అనగా శనివారం సాయంత్రం 7 గంటల నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 48 మందిపై కుక్కలు దాడిచేసినట్లు జిల్లా ఆసుపత్రివర్గాల ద్వారా తెలుస్తుంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 20 మంది కుక్కకాటుతో జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. ఇందులో చిన్న పిల్లలతోపాటు మహిళలు వృద్ధులే ఎక్కువగా ఉన్నారు.

హెచ్చరిస్తున్న 'సాక్షి'

పట్టణాలతోపాటు గ్రామాల్లో కూడా కుక్కల బెడదతో ప్రజలు పడుతున్న అవస్థలపై 'సాక్షి'లో ఎప్పటికప్పుడు కథనాలు ఇస్తున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ప్రత్యేక కథనాలతో పాలకులను, అ ధికారులను అలర్ట్ చేస్తున్నాం. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. అయినా ఏరోజు సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు. పత్రికల్లో కథనాలు వచ్చిన సమయంలో చర్యలు తీసుకుంటే కుక్కల బెడద అంత ఉండేది కాదని జిల్లా వాసులు అంటున్నారు.

జిల్లాలో రెండేళ్లలో బాధితుల వివరాలు..

నెల	2021	2022	2023
జనవరి	96	207	133
ఫిబ్రవరి	121	119	95
మార్చి	148	157	87 (మార్చి 20 వరకు)
ఏప్రిల్	101	56	
మే	49	53	
జూన్	70	85	
జులై	58	58	
ఆగస్టు	63	56	
సెప్టెంబర్	69	81	
అక్టోబర్	82	76	
నవంబర్	115	99	
డిసెంబర్	183	111	

రెండేళ్లలో 2,333 బాధితులు..

గడిచిన రెండేళ్లలో ఒక్క ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే 2,333 మంది కుక్కకాటుకు చికిత్స తీసుకున్నారు. ఇందులో 2021లో 1,155 మంది, 2022లో 1,178 మంది కుక్కకాటు బారిన పడ్డారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందినవారు అదనం. అంటే సుమారుగా రెండేళ్లలో కనీసం 3 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు. ఏటా కుక్కల దాడి బాధితులు పెరుగుతున్నారు. ఇదిలా ఉండగా, గడిచిన నెల రోజులుగా నిత్యం కుక్కకాటు బాధితులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకు వస్తున్నారు. వీరిలో అధికంగా పట్టణప్రాంతాలే ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లోనే కుక్కలు అధికంగా ఉండంతో బాధితులు కూడా పట్టణవాసులే ఎక్కుగా ఉంటున్నారని తెలుస్తోంది. కుక్కలను నియంత్రించడంతో మున్సిపల్ అధికారులు, పాలకుల వైఫల్యంతో కుక్కలతో ఇబ్బంది పడుతున్నామని నిర్లక్ష్యం పట్టణవాసులు పేర్కొంటున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మూడేళ్ల బాలికపై కుక్క దాడి చేసిన సమయలో అందరూ రావడంతో వదిలిపోయిందని, ఎవరూ గమనించకపోతే హైదరాబాద్ తరహా ఘటన పునరావతమయ్యేదని స్థానికులు 'సాక్షి'కి తెలిపారు.

కుక్కల బెడద అధికంగా..



గాజులపేట్‌లో కుక్కల బెడద అధికంగా ఉంది. రెండు రోజుల వ్యవధిలోనే గాజులపేటలో 18 మందిపై దాడి చేశాయి. కుక్కలకు రేబిస్ టీకాలు వేయకపోవడంతో కుక్కలు పిచ్చికుక్కలుగా మారి ప్రజలపై, పశువులపై దాడి చేస్తున్నాయి. అధికారులు కుక్కలను నియంత్రించాలి.
– నరేందర్, నిర్మల్

అవగాహన కల్పిస్తాం..



కుక్కలపై అవగాహన కలిగించేందుకు పట్టణంలో బ్యానర్లు, హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తాం. కుక్కలను పట్టే వారిని పిలిపిస్తాం. పెంపుడు కుక్కలకు యజమానులు టీకాలు వేయించాలి. ఎవరైనా కుక్కలకు భోజనం పెట్టాలి అనుకుంటే ఊరి చివరన మాత్రమే పెట్టాలి.
– దేవిదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

గోడు వినండి.. గోస తీర్చండి!



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

- ప్రజావాణికి తీరొక్క సమస్య..
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- సత్వర పరిష్కారానికి ఆదేశం

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రజలు వివిధ సమస్యలతో వచ్చారు. అధికంగా భూములకు పట్టాలు, పింఛన్లకు సంబంధించిన అర్జీలే రాగా, కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్వయంగా వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు సిపారసు చేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

45 నిమిషాలు ఆలస్యం...

ప్రతీ వారం నిర్వహించే ప్రజావాణి సోమవారం 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 10:30 కు ప్రారంభం కావాల్సిన ఫిర్యాదుల విభాగం 11:17 నిమిషాల వరకు కూడా ప్రారంభం కాకపోవడంతో అర్జీదారులు, జిల్లా అధికారులు వేచి ఉండాల్సి వచ్చింది. 11:17 గంటలకు కలెక్టర్ వచ్చి అర్జీలు స్వీకరించారు.

రైతుబంధు రావడం లేదు..

బోసి గ్రామంలోని 32 సర్వే నంబర్లు తనకు 2.13 ఎకరాల భూమి ఉందని, రైతుబంధు డబ్బులు రావడం లేదని రైతు అంకం గంగాధర్ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాడు. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపాడు.

స్లాట్ బుక్ కావడం లేదు..

తానూరు మండలం హిప్నెల్లి సర్వే నంబరు 38/అ/1 లో తనకు 2.మెకరాల వ్యవసాయ భూమి ఉందని, అవసరం కోసం అమ్ముదామంటే ధరణిలో స్లాట్ బుక్ కావడం లేదని సోనే కాంబ్లె బాపురావు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాడు. త్వరగా సమస్య పరిష్కరించాలని కోరాడు.

ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం తెలియజేయాలని సూచించారు.

అధికారులకు కలెక్టర్ క్లాస్..

ప్రజాఫిర్యాదుల విభాగంలో పాల్గొన్న జిల్లా అధికారులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి క్లాస్ తీసుకున్నారు. ప్రజావాణిని ప్రారంభించే ముందు అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో స్వచ్ఛత పాటించినప్పుడే వ్యాధులు దరిచేరవని తెలిపారు. ఒకరోజు ముందుగా ప్లాన్ చేసుకుని ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీల్లో రోడ్లపై చెత్త వేయకుండా చూడాలన్నారు. మురుగు కాలువలు నిత్యం శుభ్రం చేయించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు తడి పొడి చెత్త వేరుగా వేస్తున్నారో లేదో పరిశీలించాలన్నారు. పంచాయతీ పరిధిలో ఎటువంటి కార్యక్రమాలు చేస్తే ఆదాయం వస్తుందో ఆలోచన చేసి అమలు చేసేలా చూడాలని తెలిపారు. శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు త్వరగా వినియోగం తీసుకురావాలని ఆదేశించారు.

'ఆసరా' కోసం..
నివేదన.. ఆవేదన



కలెక్టర్‌కు దండం పెడుతూ కనిపిస్తున్న ఈ వృద్ధురాలి పేరు మాణిక్యమ్మ. బతుకు దెరువు కోసం జగిత్యాల జిల్లా నుంచి వచ్చి నిర్మల్‌లోని మహాలక్ష్మి కాలనీలో నివాసం ఉంటోంది. ప్రమాదవశాత్తు ఓ కాలు కోల్పోయింది. సదరం సర్టిఫికెట్‌తో దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా నిరాశే మిగులుతోంది. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణికి భర్తతో వచ్చి తన గోడు వెల్లబోసుకుంది. పింఛన్‌తోపాటు ఓ వీల్‌ఛైర్ ఇప్పించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డిని వేడుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని మండలంలోని మున్యాలకు చెందిన దివ్యాంగుడు సిపెల్లి లింగన్న పాండ్వాపూర్–కలమడుగు రోడ్డుపై పడుకొని సోమవారం నిరసన తెలిపాడు. నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని కాళ్లు చచ్చుబడి పోయాయి. దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఎవరూ స్పందించడం లేదని ఇలా నిరసన తెలిపాడు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు అక్కడకు నిరసన విరమింపజేశారు. లింగన్న పెన్షన్ దరఖాస్తు ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. – దస్తురాబాద్

న్యూస్‌రీల్

లైసెన్స్ లేకుంటే చర్యలు



వాహనదారులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ

నిర్మల్‌టౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడంతోపాటు, రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 45 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ చాలాన్లు తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్ ప్లేట్‌ను విరగొట్టినా, తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు పెడతామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు పెడతామన్నారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించకుండా రూ.500తో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది సమ్మేళనానికి ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉగాది కవి సమ్మేళనానికి జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవి దామెర రాములుకు ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా దామెర రాములు మాట్లాడుతూ తెలంగాణ 'సహజీవన సామరస్య విలువలు' అనే అంశంపై కవిత్వ పఠనం ఉంటుందని తెలిపారు.

రేపు ఉగాది కవి సమ్మేళనం

నిర్మల్ రూరల్: శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా నిర్మల భారతి సేవా క్షేత్రం, స్టేట్ టీచర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి పరమేశ్వర్, బి.వెంకట్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. కవులు తెలుగు, ఉర్దూ, హిందీ భాషల్లో తమ కవితల్ని, ముషాయిరాలను చదవవచ్చని వివరించారు. సమ్మేళనంలో పాల్గొన్న కవులకు సత్కారం ఉంటుందని తెలిపారు.


అలరించిన కవి సమ్మేళనం

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో తెలంగాణ తెలుగు కళా సంరక్షణ సమితి, తెలుగు భాష సంరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు కవులు ఉగాది పండుగ ప్రాశస్త్యాన్ని కవితల రూపంలో వినిపించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కవులు వెంకటి, నారాయణ, దశరథ్, రవి, శ్రీనివాస్‌గౌడ్, పుండలీక్‌రావు, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

'అడెల్లి'లో దుకాణాల వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ప్రాంగణంలో నిర్వహించే వివిధ దుకాణ సముదాయాలకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ధ్వర్యంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు, కనుములు సేకరించుకునే హక్కును జామ్ గ్రామానికి చెందిన వెంకటరమణ రూ.4.74 లక్షలకు దక్కించుకున్నారు. ఇతరములు–2 అనే హక్కును నిర్మల్‌కు చెందిన షేక్ హుస్సేన్ రూ.69 వేలకు దక్కించుకున్నారు. ఇక అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడి బియ్యం సేకరణకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం నిలిపివేశామని ఈవో రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆదిలాబాద్ రాజమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, రికార్డ్ అసిస్టెంట్లు బుచ్చన్న, సోని ఉన్నారు.

బీడీ పరిశ్రమ రక్షణకు పోరాడాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న రాజన్న

నిర్మల్ రూరల్ : బీడీ కార్మికుల ఉపాధి రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న కార్మికులకు పిలుపునిచ్చారు. నిర్మల్ మండలం న్యూముజ్గి గ్రామంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సభ నిర్వహించారు. దేశంలో కోటిన్నర మంది బీడి పరిశ్రమపై ఆధారపడి ఉన్నారన్నారు. కార్మికుల కూలి పెంపు, జీవన భృతి, పీఎఫ్, ఈఎస్ఐ చట్టాల అమలుకు ప్రభుత్వంతో కొట్లాడి విజయం సాధించామని వివరించారు. స్వదేశీ జపంతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ, స్వదేశీ కుటీర పరిశ్రమ బీడీలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. బీడీ పరిశ్రమలో తంబాకుపై 18 శాతం, బీడీలపై 28 శాతం జీఎస్టీ విధించడం అన్యాయమన్నారు. సమావేశంలో ధనరాజ్, కవిత, మల్లవ్వ, శ్రీనిధి, భాగ్యశ్రీ, లావణ్య, సుజాత, వనిత పాల్గొన్నారు.

జిల్లాలో ప్రారంభమైన యూడైస్ ప్లస్ వర్క్‌షాప్



సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న సీఆర్పీలు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ బడులు, విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందించే యూడైస్‌ప్లస్ కార్యక్రమాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో జిల్లాలోని 1,080 పాఠశాలల సమగ్ర సమాచారం ఆన్‌లైన్‌లో కన్‌ఫామ్ చేస్తామన్నారు. వారంపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని 19 మండలాలకు చెందిన 19 మంది సీఆర్పీలు, 10 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని 1,080 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తమ పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు నమోదైన పాఠశాలల సమగ్ర సమాచారాన్ని సరిచూసి, అవసరమైన సమాచారాన్ని సరిచేసి కన్‌ఫామ్ చేస్తారని వివరించారు. ఈ సమాచారం ఆధారంగానే వచ్చే సంవత్సరం పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నిధులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి కావాల్సిన అన్ని సదుపాయాలు యూడైస్ ప్లస్ సమాచారం ఆధారంగానే కల్పిస్తారని పరీక్షల సహాయ కమిషనర్ పద్మ పేర్కొన్నారు. ఇందులో ఏఎస్‌సీ నాగుల రవి, టెక్నికల్ పర్సన్ ఎం.లింగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు ఎంఈవో మధుసూదన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోవడం, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు కావడంపై స్థానికులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంఈవో ప్రధానోపాధ్యాయుడు మంగీలాల్‌తోపాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, గిరీశ్‌కుమార్, శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. ఒకరోజు వేతనం నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఇక మీదట మండలంలోని ప్రతీ పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బడి బయట 183 మంది

- జిల్లాలో పూర్తయిన సర్వే
- వివరాలు పోర్టల్‌లో నమోదు



బడి బయట పిల్లల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీలు

నిర్మల్‌రూరల్: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపి, బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి విద్యాశాఖ అధికారులు ఇటీవలే సర్వే చేశారు. నిరక్షరాస్యత నిర్మూలనలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా ఉండేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 10న జిల్లాలోని అన్ని మండలాల్లో సర్వే ప్రారంభించింది. జిల్లాలో 183 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పాఠశాలల్లో చదువుతూ వివిధ కారణాలతో బడి మానేసి కూలీలుగా, పశువుల కాపరులుగా, ఇటుక బట్టీల్లో పనులకు వెళ్తున్నారు. దీంతో ఏటా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

183 మంది గుర్తింపు..

జిల్లాలో 735 పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 54,227 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఇంటింటి సర్వేలో 183 మంది విద్యార్థులు బడి బయట ఉన్నట్లు గుర్తించారు. బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించేందుకు 6 నుంచి 14 ఏళ్లలోపు వారిని గుర్తించడానికి సీఆర్పీలు సర్వే చేయగా, 15 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల సర్వేను ఆర్పీలు నిర్వహించారు. జిల్లాలో ఆరు నుంచి 14 ఏళ్లలోపు బడి బయట పిల్లల సర్వేలో కుభీర్ మండలంలో అత్యధికంగా 25 మందిని గుర్తించగా, బడిబయట పిల్లలు లేని మండలాలుగా కుంటాల, దస్తూరాబాద్‌ను గుర్తించారు. 15 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల సర్వేలో అత్యధికంగా ముధోల్ మండలంలో 09 మందిని గుర్తించారు.

చదువుకునేలా ప్రోత్సహిస్తున్నాం

బడి బయట పిల్లల కోసం జిల్లా వ్యాప్తంగా ఇటీవల సీఆర్పీలతో సర్వే చేపట్టాం. మధ్యలో బడి మానేసిన, బడికి వెళ్లని వారి వివరాలు సేకరించాం. మొత్తం 183 మందిని గుర్తించాం. వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం.
– నరసయ్య, జిల్లా సెక్టోరియల్ అధికారి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై బీజేపీ నిరసన దీక్ష



నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై బీజేపీ నిరసనలు కొనసాగుతున్నాయి. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ యువత నోట్లో మట్టికొట్టి తన ఇంటికే ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్న కేసీఆర్ ఇప్పుడు బీఆర్ఎస్ నేతల పుత్రరత్నాలకు, బంధువులకు ప్రభుత్వ కొలువులు ఇప్పించే కుట్ర చేశారని ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో అక్రమాలకు పాల్పడి 30 లక్షల మంది యువతీ, యువకుల జీవితాలను ఆగం చేశారన్నారు.

కేటీఆర్ కనుసన్నల్లోనే...

గ్రూప్–1 పరీక్షకు సంబంధించి జగిత్యాల జిల్లాలోని ఓ మండలంలో 50 మందికిపైగా మెయిన్స్‌కు అర్హత సాధించారని తెలిపారు. వీరంతా బీఆర్ఎస్ నేతల కొడుకులు, బంధువులు, వాళ్ల వద్ద పనిచేసే వాళ్లు అని పేర్కొన్నారు. ఇదంతా కేసీఆర్ కొడుకు కేటీఆర్ కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం ఉందన్నారు. నిరుద్యోగ యువతకు అన్యాయం చేసి అనర్హులకు ఉద్యోగాలిప్పిస్తున్న కేసీఆర్ కొడుకును తక్షణమే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసిమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జిల్లా మల్లికార్జునరెడ్డి, గణేశ్, జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శులు కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, మిట్టపల్లి రాజేందర్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు రజిని, వైద్య, యువమోర్చా రాష్ట్ర నాయకులు అనుమల శ్రవణ్, కుమ్మరి వెంకటేశ్, బీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పున్నం నారాయణగౌడ్, బీసీ మోర్చా జిల్లా నాయకులు ఏలేటి లింగారెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, లింగారెడ్డి, విలాస్, అనిల్, నిర్మల్ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టల్ ద్వారా రాములోరి తలంబ్రాలు

ఆదిలాబాద్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రిలో శ్రీ సీతారామ కల్యాణానికి వినియోగించే తలంబ్రాలను పోస్టల్ ద్వారా అందజేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర రావు ప్రకటనలో పేర్కొన్నారు. స్పీడ్‌పోస్ట్ ద్వారా 10 గ్రాముల తలంబ్రాలు, 2 ముత్యాలు, పసుపు, కుంకుమ, మిశ్రి, 80 గ్రాముల కాజు ప్రసాదం ఇంటి వద్దకే డెలివరీ చేస్తారన్నారు. అదేవిధంగా రూ.150 చెల్లిస్తే 20 గ్రాముల కల్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోస్టాఫీస్‌లో రూ.450 చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఇందు కోసం https://eshop.tsposts.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28వ తేదీ వరకు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూచిపూడి నృత్యప్రదర్శనలో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న హరిణి

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు తోట హరీష్–శైలజ కుమార్తె హరిణి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చింది. ఉగాది పర్వదినం పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం రవిశ్రీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్, మాజీ ఐఏఎస్ అధికారి చింతల శ్రీనివాస్‌లు ఆమెకు అవార్డు అందజేశారు. నృత్య నాట్య అకాడమీ గురువు ఏలేటి అంజలి, పలువురు విద్యార్థినిని అభినందించారు.

జెడ్పీ పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌రెడ్డి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను పదో తరగతి నిర్వహణ రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. వచ్చేనెల 3 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీఫైనల్–2 పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడిన వారిపై శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లా అధికారులు నర్సయ్య, ఆశోక్, ప్రతాప్, హెచ్‌ఎం గోపాల్‌సింగ్ తిలావత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఆశ్రనాజ్ (19) అనే యువతి కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి కనిపించకపోవడం లేదని యువతి అన్నయ్య షేక్ తబ్రేజ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

‘ప్రత్యేక’ పర్యవేక్షణ ఏది?



ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

- ఆశ్రమ గిరిజన పాఠశాలల్లో కేఏటీ అమలు
- ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా టెస్టు
- కొన్నిచోట్ల అధికారుల పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో వందశాతం లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పాఠశాలల్లో 2022 డిసెంబర్ 1 నుంచి సబ్జెక్టుల వారీగా నాలెడ్జ్ అసైస్‌మెంట్ టెస్టు (కేఏటీ)ను అమలు చేస్తున్నారు. ఈ టెస్టు ప్రతిరోజు సబ్జెక్టు వారీగా నిర్వహిస్తారు. టెస్టుకు ముందు రోజు సంబంధిత ఉపాధ్యాయుడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అలాగే విద్యార్థులకు వివిధ సామగ్రిని సైతం ఐటీడీఏ ద్వారా సరఫరా చేసింది. కేఏటీ సక్రమంగా కొనసాగుతుందో లేదోనని, టీ, స్నాక్స్, బిస్కెట్స్ సక్రమంగా అందుతున్నాయో లేదోనని పర్యవేక్షణ కోసం ఐటీడీఏ ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులో సంబంధిత డివిజన్ ఏటీడీవో, ఏసీఎంవో, డీఎస్‌వో స్థాయి అధికారులు ఉన్నారు.

జిల్లాలో..

జిల్లాలోని 48 ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 1,700 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో సబ్జెక్టు వారీగా ప్రతి రోజు టెస్టులు నిర్వహిస్తున్నారు. అవి సక్రమంగా కొనసాగుతున్నాయోలేదోనని ప్రత్యేక అధికారులు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల సమయంలో పర్యవేక్షణ చేయాలి. కాని కొన్ని డివిజన్లలో పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పలు సబ్జెక్టులపై దృష్టి

విద్యార్థులు సోషల్, సైన్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకుగాను అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి అనంతరం ఏం చదవాలో వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో పురోగతి ఎలా ఉందనే అంశాన్ని ప్రత్యేక అధికారులు పరిశీలించాలి. కాని జిల్లాలోని కొన్ని చోట్ల పర్యవేక్షణ కొనసాగడం లేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాం. సాయంత్రం 5 నుంచి 7 గంటల ప్రాంతంలో వెళ్లి పర్యవేక్షించాలి. కొన్నిచోట్ల పర్యవేక్షణ జరగడం లేదనే విషయం తమ దృష్టికి రాలేదు. వారి పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ దిలీప్ కుమార్, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ

‘కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం’



మాట్లాడుతున్న జనార్దన్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తు వ్యవహరిస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో సోమవారం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ జిల్లా 8వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందన్నారు. శ్రమ దోపిడీకి గురవుతున్న బీడీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. బీడీ, హాస్టల్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. ఓట్ల రాజకీయాలు చేస్తూ కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని అన్నారు. నాయకులు సునారికారి రాజేష్, భూక్య విలాస్, దుర్గం లింగన్న, లక్ష్మి, ఎం.హరిత, గోదావరి, కవిత పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

- వరంగల్ లేబర్ జాయింట్ కమిషనర్ సునీత



ఈ–శ్రమ్ పత్రాలు అందజేస్తున్న సునీత

ఆదిలాబాద్‌రూరల్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి వివరాలను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని వరంగల్ లేబర్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా ఈ–శ్రమ్‌లో పేర్లు నమోదు చేసి పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాలను వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రావణి, అధికారులు వినోద్, రాజలింగు, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంధుడి నిరసన



తల్లితో కలిసి బైఠాయించిన అంధుడు రాజేశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు అన్ని అర్హతలు ఉన్న తనను ఎంపిక చేయాలని సారంగాపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన రాజేశ్వర్ అంధుడు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపాడు. తన తల్లితో కలిసి బైఠాయించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగం కోసం పలుమార్లు కలెక్టర్లను కలిసి విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని అన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: రెండు సెల్‌ఫోన్లు, టీవీ దొంగతనం చేసిన కేసులో ఇద్దరికి మూడునెలల జైలుశిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌లో నివాసముంటున్న రచర్ల చిన్నయ్య 2015, మే 25న తన తల్లిని ఇంట్లో ఉంచి బయటకు వెళ్లాడు. అదేరోజు రాత్రి గాజులపేట్‌కు చెందిన అన్నదమ్ములు మోతే కృష్ణ(30), మోతే రాజేందర్ (20)లు చిన్నయ్య ఇంట్లో చొరబడి రెండు సెల్ ఫోన్లు, టీవీని దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ఇద్దరిని హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ ఐదుగురి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు చేయడంతో ఈ మేరకు నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

సోలార్ బ్యాటరీల చోరీ




తానూరు: మండలంలోని భోసి గ్రామంలో రైతులు తమ పంటల రక్షణ కోసం ఏర్పాటుచేసిన సోలార్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. భోసి శివారు ప్రాంతంలో రైతులు మొక్కజొన్న, ఇతర పంటల రక్షణ కోసం సోలార్ సిస్టమ్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 9 మంది రైతులకు సంబంధించిన సోలార్ బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బాధిత రైతులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కోటపల్లి(చెన్నూర్): హత్య కేసులో మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి బి.సత్తయ్య జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చెన్నూర్‌కు చెందిన బెల్లంకొండ రాజ్‌కుమార్‌కు కోటపల్లి మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్ భార్యతో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో 2018 జనవరి 15న అతన్ని హత్య చేయగా అప్పటి సీఐ కిషోర్, ఎస్సై వెంకన్న కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం తుది విచారణకు రాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు కేసు వాదనలు వినిపించగా జడ్జి సత్తయ్య సదరు నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సీఐ వివరించారు.

బాధితుడికి దాతల ఆర్థికసాయం

సాక్షి స్పందన



ఫోన్ పే ద్వారా నాగరాజు పంపిన రూ. 2 వేలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటకు చెందిన పొలాస రవి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ అనంతరం ఖర్చులకు మరో రూ.2 లక్షలు అవసరమయ్యాయి. ఈ విషయమై ‘దాతలు సాయం అందించరూ’ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందిస్తున్నారు. మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన నామెడ ధర్మరాజు రూ.10 వేలు, రంగపేటకు చెందిన ఎన్ఆర్‌ఐలు గడ్డం మనీశ్‌రెడ్డి రూ.5 వేలు, ఏలేటి రాజశేఖర్‌రెడ్డి రూ.5 వేలు, పట్టణానికి చెందిన ఒడ్డెటి నాగరాజు రూ.2 వేలు, మిగతా పలువురు రూ.వెయ్యి, రూ. 500 చొప్పున ఫోన్ పేకు పంపారని బాధిత కుటుంబీకులు తెలిపారు. సోమవారం దాతల నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం అందాయని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కుమ్ర ఈశ్వరిబాయి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి

నార్నూర్: పరీక్షల వేళ విద్యార్థుల ఆరోగ్యం, మెనూపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. డైనింగ్ హాల్, స్టోర్ రూంను పరిశీలించారు. స్టోర్‌లో కూరగాయలు చెడిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పోషకాహార లోపం వల్ల ఇలా జరిగిందని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. బాలికలకు సరిపడా వసతి గదులు లేదని, మరుగుదొడ్లు, నీటి సమస్య ఉందని విద్యార్థిని తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. నూతన వసతి గృహం నిర్మాణంలో ఉన్నందున త్వరగా పూర్తి చేయించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌సీవో గంగాధర్‌ను ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థిని ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ కనక మోతుబాయి, మహిళా నాయకురాలు విద్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రోగితో మాట్లాడుతున్న ఎస్పీ

సిరికొండ: గిరిజన యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కన్నాపూర్‌లో ఎస్పీ ఆదేశాలతో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి గిరిజన సంప్రదాయ పద్ధతిలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన యువత చదువులు మధ్యలో ఆపేయకుండా కొనసాగించాలన్నారు. బాగా చదవి తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ శిబిరానికి సుమారు 20 గ్రామాల నుంచి 400 మంది హాజరుకాగా, రిమ్స్, ఉట్నూర్ పీహెచ్‌సీ వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. రోగులకు వైద్య చికిత్స అందించిన వైద్యులను ఎస్పీ అభినందించారు. ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, జెడ్పీటీసీ కుంరం చంద్రకళ, సర్పంచ్ కుంరం రఘురాం, సీఐలు నైలు, సైదారావు, ఎస్సైలు డి.సునీల్, నీరేష్, డాక్టర్లు దీపక్ పుష్కర్, వీణా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

‘సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం’



మాట్లాడుతున్న ట్రైనర్ రాఘవేంద్ర



హాజరైన విద్యార్థులు

భైంసా: దైనందిన జీవితంలో సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్తేనే విజయం దరి చేరుతుందని ప్రముఖ ఇంగ్లిష్ ట్రైనర్, కౌన్సెలర్, కోచ్ రాఘవేంద్ర అన్నారు. బాసర ఆర్జీయూకేటీలో కెరీర్, ఇంటర్వ్యూ అనే అంశాలపై సోమవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. దయల్ యువర్ విలేజ్ సంస్థ ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌లో భాగంగా అవకాశాలు, సవాళ్లు అనే అంశాలపై వివరించారు. మెలకువలు, ఉపాధి అవకాశాలు, కోర్సులు, వాటి ప్రాధాన్యత, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీ హరి బాబు, రవికాంత్, రాధాకృష్ణ, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

హత్యకు దారితీసిన గొడవ

- బంగారుగూడలో ఘటన
- కేసు నమోదు



రిజ్వాన్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: ఆ నలుగురు స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఒకరి హత్యకు దారితీసింది. మండలంలోని బంగారుగూడలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. బంగారుగూడకు చెందిన మతీన్, ఫెరోజ్, అర్బాజ్, రిజ్వాన్‌లు స్నేహితులు. సోమవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో విందుకు వెళ్లారు. అనంతరం ఈ నలుగురు బంగారుగూడకు చేరుకున్న తర్వాత వీరి మధ్య గొడవ జరిగింది. మతీన్, ఫెరోజ్, అర్బాజ్‌లు కలిసి రిజ్వాన్(25) అతని ఇంటి ముందు గొంతు నులిమి హత్య చేశారు. కాగా, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూసి రిజ్వాన్ కిందపడిపోగా, చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రిజ్వాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే ఫోన్ కోసం వీరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌కు గురై మహారాష్ట్రకు చెందిన ఓ యువతి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాఠన్‌బోరికి చెందిన యూనుస్ పఠాన్ పెద్ద కుమార్తె సుమయ్య పఠాన్(17) ఈనెల 19న ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఇనుప తీగలపై బట్టలు ఆరబెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబీకులు పాఠన్‌బోరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో ఆదిలాబాద్ రిమ్స్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకున్నారు. కాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని ట్రక్ డ్రైవర్ మృతి

భైంసాటౌన్: కారు ఢీకొని ట్రక్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన భైంసాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని హథ్‌గాం తాలూకా పలాస్‌వాడితండా గ్రామానికి చెందిన బాలు పవార్(30) అనే ట్రక్ డ్రైవర్ సోమవారం సిమెంట్ లోడ్‌తో మంచిర్యాల జిల్లా దేవాపూర్ భైంసా మీదుగా నాందేడ్ వెళ్తున్నాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో భైంసాలోని ఎస్ఎస్ కాటన్ సమీపంలో లారీ నిలిపి టైర్లను చెక్ చేస్తున్నాడు. ఈ క్రమంలో నిర్మల్ వైపు నుంచి వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు బాలును ఢీకొట్టి వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. సీసీటీవీ పుటేజీ ఆధారంగా కారును గుర్తించారు. మృతుడి తండ్రి సేవా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తానూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విక్రమ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తానూరుకు చెందిన కల్లూరు రాములు గ్రామ సమీపంలో జరిగిన విందు కార్యక్రమానికి వెళ్లి ఇంటికి నడుచుకుంటూ తిరిగి వస్తున్నాడు. తానూరు నుంచి బెల్‌తరోడాకు లక్ష్మణ్ బైక్‌పై అతివేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద రాములును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రయాణికులు, స్థానికులు భైంసా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి పంపించారు.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



తొట్టిలో నీళ్లు పోస్తున్న అటవీశాఖ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో పిచ్చుకల దాహం తీరడానికి అధికారులు నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సునీల్ హేరామత్, అటవీశాఖ రిటైర్డ్ అధికారులు ఐలయ్య, రాజారావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అల్ఫోర్స్'లో ఉగాది వేడుకలు



మామిడికాయలు అందిస్తున్న నరేందర్ రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. చైర్మన్ నరేందర్‌రెడ్డి ఉగాది పర్వదినం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షవర్ధిని, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం హామీ మేరకు సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జేఏసీ జిల్లా చైర్మన్ భూసారపు గంగాధర్ అన్నారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సెర్ప్ ఉద్యోగుల మాదిరి కనీస వేతన పేస్కేలు అమలు చేయాలని కోరారు. ఐదేళ్లలో మరణించిన ఉద్యోగులకు ప్రభుత్వం తరఫున కనీస సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

భైంసాటౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని.. ఈ అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం భైంసాలోని బస్టాండ్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. సీనియర్ నాయకులు ఆనంద్‌రావు సిందే మాట్లాడుతూ లీకేజీ వ్యవహారంలో బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు భూమన్న, హైమద్, కుభీర్ మండలాధ్యక్షుడు జయరాం తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా తుకారాం



ముధోల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా తుకారాం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముధోల్ తహసీల్దార్ శ్యాంసుందర్ బదిలీపై నిర్మల్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో తుకారాం బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్‌ను నాయకులు, సిబ్బంది సన్మానించారు.

దారి కోసం రైతుల రాస్తారోకో



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

కుభీర్: తమ చేన్లకు వెళ్లే దారి ఆక్రమణకు గురవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని సోమవారం మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో రైతులు ధర్నా నిర్వహించారు. వడ్డెర కాలనీ పక్క నుంచి జామ్‌గాం, పార్డి(కె) వెళ్లేందుకు పానాది(బండ్లబాట) ఉండేది. ఈ పానాదిని ఆనుకొని ప్రభుత్వం కొందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చింది. కొందరు తమకు కేటాయించిన ప్లాట్లతోపాటు పానాది స్థలాన్ని ఆక్రమించుకొని రేకులషెడ్డు వేసుకున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది అవుతుండగా ఆక్రమణ షెడ్లు తొలగించాలని ఏడాదిగా పోరాడుతున్నారు. ధర్నా వద్దకు తహసీల్దార్ విశ్వంభర్ వచ్చి సమస్య పరిష్కరిస్తామనడంతో రైతులు ఆందోళన విరమించారు. ఫుప్పాల లింగం, పి.పిరాజీ, ఉప్పు రాజేశ్వర్, దత్తు, బాలాజీ, ఆనంద్, గంగాధర్, పుప్పాల రాజేశ్వర్, దొంతుల గణేశ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

భైంసారూరల్: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ కల్పన అన్నారు. సోమవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సబ్‌కీ యోజన సబ్‌కా వికాస్‌పై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

భూదాతలు..అభివృద్ధి ప్రదాతలు



వద్యాల్‌లో నల్ల భీంరెడ్డి దానం చేసిన భూమిలో నిర్మించిన పాఠశాల

- మండలంలో పలువురి ఔదార్యం
- ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం

లక్ష్మణచాంద: సమాజంలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా తమ గ్రామాలకు సేవ చేస్తుంటారు. కాని కొందరు మాత్రమే సొంత ఊర్ల రుణం తీర్చుకోవాలనే తపనతో గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుంటారు. లక్ష్మణచాంద మండలంలో పలువురు దాతలు తమ గ్రామాల అభివృద్ధి కోసం సొంత భూమినే దానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. మరికొందరు తమ గ్రామంలో సొంత డబ్బులతో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు.

గోపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిది



లక్ష్మణచాంద అభివృద్ధిలో గోపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిది. అప్పటి సర్పంచ్ గోపాల్‌రెడ్డి పీహెచ్‌సీకి రెండెకరాలు ఇవ్వడంతోపాటు ఆసుపత్రి నిర్మాణంలో రూ.40వేలను వెచ్చించారు. నామమాత్రపు డబ్బులకే మరో రెండు ఎకరాలు పాఠశాలకు కేటాయించారు.

– ముత్యంరెడ్డి సర్పంచ్, లక్ష్మణచాంద

భూదానం గొప్ప విషయం



వద్యాల్‌లో నల్ల భీమ్‌రెడ్డి పాఠశాల, పశువైద్యశాల, పంచాయతీ భవనాల కోసం భూమి ఇవ్వడం గొప్ప విషయం. వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత గ్రామాభివృద్ధికి తోడ్పడాలి.

– మోహన్, వద్యాల్ ఉపసర్పంచ్

ఆలయం మరింత అభివృద్ధి



రెండో వేములవాడగా ప్రసిద్ధి గాంచిన బాబాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించే కోనేరు కోసం నర్సాపూర్‌కు చెందిన రాజేశ్వర్‌రెడ్డి భూమిని దానం చేయడంతో ఆలయం మరింత అభివృద్ధి చెందుతుంది. భక్తులకు కూడా ఇబ్బందులు తీరనున్నాయి.

– లక్ష్మణ్, నర్సాపూర్ ఉప సర్పంచ్

- మండలంలోని వద్యాల్ గ్రామానికి చెందిన నల్ల భీంరెడ్డి తన గ్రామాభివృద్ధి కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం, మూడు గుంటల భూమిని పశువుల ఆసుపత్రి కోసం, మరో రెండు గుంటల భూమిని పంచాయతీ భవన నిర్మాణం కోసం దానమిచ్చి ఔదార్యం చాటుకున్నారు. వారు దానం చేసిన భూమిలోనే ప్రస్తుతం ఉన్నత పాఠశాల, పశువైద్యశాల, పంచాయతీ భవనం కొనసాగుతున్నాయి. ఇక్కడ ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం భూమి ధర రూ.50 లక్షల వరకు ఉంటుంది.
- లక్ష్మణచాందలో సురకంటి గోపాల్‌రెడ్డి తన గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం స్థలం లేకపోవడంతో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో తన రెండెకరాల భూమిని అందించారు. ఆసుపత్రి నిర్మాణ సమయంలో తన ఇంటినే ఆసుపత్రిగా మార్చినట్లు పలువురు గ్రామస్తులు నేటికి గుర్తు చేసుకుంటారు. ప్రస్తుతం పీహెచ్‌సీ వెనుక భాగంలో ఆయన దానం చేసిన భూమిలోనే పల్లె–ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎకరం భూమి ధర రూ.55 లక్షల వరకు ఉంటుంది.
- బాబాపూర్‌లో పురాతనమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద కోనేరు ఏర్పాటు కోసం నర్సాపూర్(డబ్ల్యూ)కు చెందిన రాజేశ్వర్‌రెడ్డి అరెకరం భూమిని దానం చేశారు. ప్రస్తుతం అందులో కోనేరు నిర్మించేందుకు రూ.40 లక్షలు మంజూరవగా.. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరం ధర రూ.30లక్షలు పలుకుతోంది.
- పీచర గ్రామంలో సమ్మితి గోపాల్‌రావు దొర స్మారకార్థం ఆయన కుమారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం అరెకరం భూమిని దానం చేయగా.. ఇప్పుడు అందులోనే పాఠశాల సాగుతోంది.
- చింతల్‌చాందకు చెందిన సాధు విశాల్‌రెడ్డి గ్రామంలోని వినాయకుడి ఆలయం వద్ద మండపం నిర్మించేందుకు రూ.మూడు లక్షలు అందించారు. అలాగే ఏళ్లుగా వినాయకుడి ఆలయ పూజారికి నెలకు రూ.5వేల చొప్పున అందిస్తున్నారు.

వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలి

లక్ష్మణచాంద: తమ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవా లని ఎస్సై రాహుల్ గైక్వాడ్ వాహనదారులకు సూచించారు. సోమవారం మండలంలోని కనకాపూర్ వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. కనకాపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారని తెలియడంతో రత్నాపూర్ కాండ్లీ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'అందరికీ శాపంగా బీజేపీ పాలన'

భైంసా: కేంద్రంలోని బీజేపీ పాలన అన్నివర్గాలకు శాపంగా మారిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ హయాంలో సామాన్యుల బతుకులు ఆగమయ్యాయని, నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటాయని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.1300 కోట్లను విడుదల చేయడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కుభీర్: తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం పల్సి గ్రామస్తులు భైఠాయించారు. గ్రామంలోని కొత్తకాలనీలో 500 జనాభా ఉంటుందని.. ఉన్న నాలుగు బోర్లలో ఒక్కటి పని చేయడం లేదని వాపోయారు. తమకు భగీరథ నీరు రావడం లేదని.. కిలోమీటర్ వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నామని వాపోయారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో కవి రాజు మంగళవారం భగీరథ ఏఈతో వచ్చి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు.

సంక్షిప్త వార్తలు

'లీకేజీ ఘటనలో బీజేపీ పాత్ర'

ఖానాపూర్: ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలో బీజేపీ నాయకుల పాత్ర ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు పరిమి సురేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, గజేందర్, ప్రదీప్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

న్యాయం చేయాలని డీడబ్ల్యూవోకు వినతి

భైంసాటౌన్: ఐసీడీఎస్ భైంసా ప్రాజెక్టు కార్యాలయంలో నాలుగేళ్లుగా పనిచేస్తున్నా.. తనకు ఆఫీస్ సబార్డినేట్ పోస్టు రాకుండా కొందరు అంగన్‌వాడీ టీచర్లు అడ్డుకున్నారని జక్కుల సావిత్రి వాపోయింది. ఈమేరకు సోమవారం డీడబ్ల్యూవో(జిల్లా సంక్షేమాధికారి) విజయలక్ష్మిని కలిసి తనకు న్యాయం చేయాలని విన్నవించింది. జయ, సవిత, శైలజ అనే అంగన్‌వాడీ టీచర్లు వేరే మహిళకు పోస్టు ఇప్పించేందుకు యత్నిస్తున్నారని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. అలాగే ఆఫీస్ సబార్డినేట్ పోస్టు మరో మహిళకు కేటాయిస్తూ ఆర్డర్ కాపీ రావడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు అంగన్‌వాడీ టీచర్లు డీడబ్ల్యూవోను కలిసి వినతిపత్రం అందజేశారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

సారంగపూర్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జామ్ గ్రామ పంచాయతీ భవనంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జామ్ గ్రామ బస్టాండ్ ప్రాంగణంలో జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి చలివేంద్రం ప్రారంభించారు. కార్యదర్శి అశోక్, సర్పంచ్ మురళీకృష్ణ, ఉపసర్పంచ్ విలాస్, చందు, ప్రవీణ్, భోజన్న ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేద్దాం

ఖానాపూర్: ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అవగాహన కల్పిస్తూ పట్టణంలో ఆర్య స్కూల్ విద్యార్థులు ర్యాలీ తీశారు. సోమవారం సేవ్ సాయిల్ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల గుండా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్‌గా సుజాతను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో సుజాతను శాలువాతో సన్మానించి ప్రశంసాపత్రం అందించారు. క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్లు, హన్మంతు, వెంకటస్వామి, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కుంటాల: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని వెంకూర్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఆదివారం రాత్రి వెంకూర్ గ్రామంలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కలీంకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ఈటల' జన్మదిన వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈటెల రాజేందర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్, చిన్నయ్య, హనుమాండ్లు, భీమేశ్, నరేశ్, స్వామి పాల్గొన్నారు.

వెండి కిరీటం అందజేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం ఓ భక్తుడు 21 తులాల వెండి కిరీటం అందించారు. ఖానాపూర్‌కు చెందిన శరత్‌రావు–స్నేహ దంపతులు కిరీటం అందించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్షీరాభిషేకం

ముధోల్: మండలంలోని తరోడలో డ్వాక్రా సంఘం మహిళలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తరోడ సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తరోడలో 28 సంఘాలకు రూ.4.50లక్షల వడ్డీలేని రుణాలను అందించిందన్నారు. ఎంపీటీసీ గంగాధర్, ఉపసర్పంచ్ సూర్జవాయ్యాఖాన్, రాములు, సీసీ పోశెట్టి, వీవోఏ ఉమేశ్వర్, రాధ తదితరులున్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సెర్ప్ సిబ్బంది సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఐకేపీ ఏపీఎం మల్లేశ్ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి నూతన వేతనాలు అమల్లోకి వస్తాయని.. దీంతో రాష్ట్రంలోని సెర్ప్ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సీసీలు సుకుమార్, రాజేశ్వర్, మహేందర్, మల్లేశ్ ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్ పర్యటన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్ కాలనీలో సోమవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఇటీవల కాలనీవాసుల కోసం వేయించిన మంచినీటి బోరును పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ సంఘ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకున్నారు. వార్డు అభివృద్ధి అధ్యక్షుడు రాజేశ్వర్, కె.కిషన్, గంగన్న, బిక్క నవీన్, బిక్క రాజేశ్వర్, రంజిత్, దేగం రాజన్న, తదితరులు ఉన్నారు.

ఆవోపా సభ్యులకు సన్మానం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో రాష్ట్ర వైశ్య ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులను సోమవారం సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు మల్లీ పెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి పోలా శ్రీధర్, ఉపాధ్యక్షుడు చెన్నకేశవ, క్యాషియర్ శ్రీనివాస్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలిశెట్టి శ్రీనివాస్, మంత్రి శ్రీనివాస్, వెంకటరమణ, దయానంద్‌కుమార్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లోకేశ్వరం: ఈనెల 23 నుంచి 29వరకు జరిగే జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ అవరణలో జనచైతన్య యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిమ్మాపూర్ ముత్తన్న, దేవేందర్, ప్రసాద్ ఉన్నారు.

గ్రామసభల్లో 59 దరఖాస్తులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి, సుర్జాపూర్, మస్కాపూర్, దిలావర్‌పూర్, పాతఎల్లాపూర్, బీర్నంది, సత్తనపల్లి, సింగాపూర్, రాజురా గ్రామాల్లో సోమవారం స్వయం ఉపాధి పథకంలో భాగంగా మైనార్టీ కార్పొరేషన్ దరఖాస్తులపై గ్రామసభ నిర్వహించామని ఎంపీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల ద్వారా వచ్చిన 59 దరఖాస్తులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్‌లు శ్రీనివాస్, రామకృష్ణ, కార్యదర్శి సురేందర్, నవీన్ ఉన్నారు.

రైతుకు ప్రజాసంఘాల మద్దతు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ వీడీసీ సభ్యులు, సర్పంచ్ కలసి కన్కపూర్‌కు చెందిన దళిత రైతు కొబ్బన్నోల్ల పెద్ద గంగన్న ఐదెకరాల భూమిని కబ్జా చేశారు. సోమవారం ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు కన్కపూర్‌లో కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఎస్సై, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, కన్కపూర్ సర్పంచ్ నరేష్, చిన్నికుమార్, బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జి రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగం

కుంటాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకూర్ శివారులోని సర్వే నంబర్ 188, 181, 179.0, 192 పట్టా భూమి నుంచి కొందరు అనుమతుల్లేకుండా మొరం తరలిస్తున్నారని కోరుతూ గ్రామానికే చెందిన గుమ్ముల దినేశ్ వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పశువైద్యాధికారి ప్రకాశ్, ఎంపీవో రహీం, ఎంఈవో ముత్యం, తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు సోమవారం కొనసాగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 367 మందికి గాను, 340 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ హమీద్ తెలిపారు. ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో 354కు గాను 323 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి



బహుమతి ఇస్తున్న డీఈవో రవీందర్, అధికారులు

నిర్మల్: కష్టపడి చదివి ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానంలో నిలవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో సోమవారం చాణక్య హైస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా డీఈఓ, ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ట్రిపుల్‌ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పావని, వైద్యులు చక్రధారి, ప్రమోద్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు. డీఈఓ మాట్లాడుతూ సరస్వతీతల్లి కొలువుదీరిన నిర్మల్ జిల్లా విద్యార్థులు చదువుతో జీవితంలో ఎదగాలన్నారు. ఎంఈఓ శంకర్, న్యాయవాది కృష్ణమోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, ప్రభాకర్, శంకర్, కల్యాణిసుందర్ పాల్గొన్నారు.

ల్యాబ్ మెటీరియల్ అందజేత



ప్రధానోపాధ్యాయులకు అందిస్తున్న ఎంపీపీ పద్మ

లక్ష్మణచాంద: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఓ కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీపీ అడ్వాల పద్మ రూ.80 వేల విలువైన ల్యాబ్ మెటీరియల్ అందజేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల సందర్శన సమయంలో మెటీరియల్ లేక ప్రయోగాలు చేయడం లేదని విద్యార్థులు ఎంపీపీకి విన్నవించారు. స్పందించిన ఎంపీపీ సోమవారం ఒక్కో పాఠశాలకు రూ.10 వేల విలువైన మెటీరియల్ మొత్తం 80 వేల విలువైన మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కల్పనారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, కేజీబీవీ ఎస్‌వో నవిత, ఎంఈవో మధుసుధ, ప్రధానోపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పోషణ పక్షోత్సవాలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం చిరుధాన్యాల ఉపయోగాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు తెలిసేలా అవగాహన కల్పించడమే పోషణ్ పఖ్వాడా ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదేవి పేర్కొన్నారు. అనంతరం పోషకాహారంపై అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, అరుణ, సునీత, గంగవ్వ, సులోచన, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కుంటాల: చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా ఈనెల 20 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహించాలని తహసీల్దార్ కలీం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పశువైద్యాధికారి ప్రకాశ్, ఎంఈవో ముత్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మివిశారద, ఎంపీవో నవీన్, ఏపీవో నవీన్, ఏపీఎం భోజన్న తదితరులున్నారు.

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె, ఆకొండపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సైనాజ్‌పర్వీ అంగన్‌వాడీ టీచర్లు గీతాంజలి, రాజమణి పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి'



ఖానాపూర్: దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భైంసాలోని ఏరియాస్పత్రి ముందు నిరసన దీక్ష చేపట్టారు. మంత్రి కేటీఆర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, సుమన్‌కుమార్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, సాహెబ్‌రావు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: బీఆర్‌ఎస్ వైఫల్యంతోనే ప్రశ్నాపత్రం లీకేజీ ఘటన జరిగిందని పెంబి జెడ్పీటీసీ జానుబాయి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన రిలే దీక్షలో పాల్గొని మాట్లాడారు. రితేశ్ రాథోడ్, టేకు ప్రకాశ్, తోకల బుచ్చన్న, అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, దేశాయి రాము, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలన



ఎర్వచింతల్‌లో పంట పరిశీలిస్తున్న అధికారి రవి

ఖానాపూర్: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్నతోపాటు నువ్వు, మామిడి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బావాపూర్(ఆర్)లో బత్తుల సంతోశ్, పటేల్ రవి, గంగాధర్, బత్తుల మనోహర్‌తోపాటు పలువురు రైతుల మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి ఆసం రవి పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని.. నష్టం వివరాలను సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని అధికారి తెలిపారు. కార్యక్రమంలో రైతులతోపాటు ఎర్వచింతల్ సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: వేతన సవరణతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్‌లో నిర్వహించే విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కార సాధన సన్నాహక సమావేశానికి ఖానాపూర్ నుంచి పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈనెల 24న నిర్వహించే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా 1104 యూనియన్ సెక్రెటరీ పోచయ్య, కొడాలి రమణ, నవీన్ తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెంబి: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ని డీఎస్పీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల ప్రయోజనాలు వివరించి.. ఏర్పాటుపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో ఎస్సై రజినీకాంత్, పలువురు సిబ్బంది ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: నిర్మల్ మండల సర్వసర సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయిరాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. దీనికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని వారు పేర్కొ న్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తు చేసుకున్న కూలీలకు జాబ్‌కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్ సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు తదితరులు ఉన్నారు.

వారంసంత వేలం

లోకేశ్వరం: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతకు సోమవారం పంచాయతీ అవరణలో వేలంపాట నిర్వహించారు. పాడి నవీన్ రూ.1.90 లక్షలకు వేలం పాడి నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్నారు. సర్పంచ్ సౌజన్య తదితరులున్నారు.